andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంగళవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 41.1; కనిష్ఠం 27.4



టెన్త్ సప్లమెంటరీ
పరీక్ష ఫీజు 16 లోగా చెల్లించాలి : డీఈవో

నిర్మల్ కల్చరల్, మే 7 : పదోతరగతి సప్లమెంటరీ పరీక్ష రాసేందుకు ఫీజు చెల్లింపు గడువు ఈ నెల 16 వరకు ఉందని డీఈవో రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులకు చెల్లించాలన్నారు. ఆలస్యరుసుముతో పరీక్ష రెండు రోజుల ముందు వరకు చెల్లించవచ్చునన్నారు. పరీక్షలు జూన్ 6 నుండి 13 వరకు నిర్వహిస్తారన్నారు. పరీక్ష రాయలేకపోయినవారు, పరీక్ష తప్పిన వారు ఈ అవకాశం ఉపయోగించుకోవచ్చునన్నారు. ప్రధానోపాధ్యాయులు నామినల్ రోల్స్ 20 లోగా కార్యాలయంలో అందజేయాలన్నారు.



వ్యూహ ప్రతివ్యూహాలు

- జిల్లాలో పతాకస్థాయిలో ప్రచారపర్వం
- పోటాపోటీగా బీజేపీ, కాంగ్రెస్
- తగ్గేదేలేదంటున్న బీఆర్ఎస్ పార్టీ
- ఇక రంగంలోకి అన్ని పార్టీల అగ్రనేతలు

నిర్మల్, మే 7 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో లోక్‌సభ ఎన్నికల ప్రచార పర్వం పతాకస్థాయికి చేరుకుంది. కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు పోటాపోటీగా తమ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ నువ్వా నేనా అన్న రీతిలో తలపడుతున్నాయి. అయితే కాంగ్రెస్, బీజేపీలు మొదటి నుంచి వ్యూహాత్మకంగా ప్రచారపర్వాన్ని నిర్వహిస్తూ దూసుకుపోతుండగా కొద్ది రోజుల నుంచి బీఆర్ఎస్ పార్టీ సైతం ప్రచారపర్వాన్ని ముమ్మరం చేస్తుండడంతో ఎన్నికల రాజకీయ వ్యవహారం ఆసక్తికరంగా మారుతోంది. నిర్మల్ అసెంబ్లీ సెగ్మెంట్‌తో పాటు ముథోల్, ఖానాపూర్ సెగ్మెంట్‌లలో మూడు పార్టీల నేతలు ప్రచారపర్వంలో మునిగి తేలుతున్నారు. జిల్లాలోని మూడు సెగ్మెంట్‌లకు గానూ మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ రెండు నియోజకవర్గాల్లో గెలుపొందగా కాంగ్రెస్ పార్టీ ఒక నియోజకవర్గంలో విజయం సాధించిన సంగతి తెలిసిందే. నిర్మల్, ముథోల్ నియోజకవర్గాల్లో కాషాయజెండా ఎగురగా, ఖానాపూర్‌లో కాంగ్రెస్ విజయం సాధించింది. అయితే ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ప్రభావం తలకిందులయ్యే అవకాశం ఉంటుందంటున్నారు. అదే విధంగా కాంగ్రెస్ పార్టీ మొన్నటి వరకు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీని వెనక్కి నెట్టేసి బీజేపీతో సమఉజ్జీగా తలపడుతోంది. ప్రస్తుతం జిల్లాలో కాంగ్రెస్, బీజేపీల మధ్యనే ద్విముఖ పోటీ కనిపిస్తుండగా బీఆర్ఎస్ పార్టీ కూడా వెనకడుగు వేయకుండా తన అస్తిత్వాన్ని కాపాడుకునే ప్రయత్నం చేస్తోంది. ఇలా మూడు పార్టీల హోరాహోరీ ప్రచారపర్వం జిల్లాలో మండుటెండల తీవ్రతను సైతం దాటేస్తోందంటున్నారు. ప్రతీరోజూ వ్యూహ ప్రతివ్యూహాలతో పార్టీల నేతలు రాబోయే రోజులకు అనుగుణంగా ప్రచారశైలిని మార్చుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. కాగా ఇప్పటి వరకు అన్ని పార్టీలకు చెందిన స్థానిక నాయకులు ప్రచారం కొనసాగిస్తుండగా ఇటీవలే కాంగ్రెస్ పార్టీ తరఫున ఆ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ జిల్లాకేంద్రంలో జరిగిన బహిరంగసభలో పాల్గొన్నారు. ఆ సభ సక్సెస్ కావడంతో కాంగ్రెస్ జోష్‌లో ఉంది. కాగా బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు సైతం తమ అగ్రనేతలను రంగంలోకి దింపేందుకు సిద్ధమవుతున్నాయి. ఇందులో భాగంగానే మొదట బీఆర్ఎస్ పార్టీ తమ అగ్రనేత కేటీఆర్‌ను జిల్లాలో ప్రచారానికి ఆహ్వానించింది. ఈ నెల 9వ తేదీన కేటీఆర్ జిల్లాలోని భైంసా, నిర్మల్‌లలో జరిగే రోడ్‌షోలో పాల్గొని తమ పార్టీ ప్రచార పర్వానికి తుది మెరుగులు దిద్దబోనున్నారు.



ఎత్తుకు పైఎత్తులు

కాగా బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఎలాగైనా జిల్లాలో మెజార్టీ సాధించేందుకు ఎత్తుకు పై ఎత్తులు వేస్తున్నారు. ఈ ఎన్నికలు తమ రాజకీయ భవిష్యత్‌కు సవాల్ కానున్నాయని ఈ పార్టీల నేతలు భావిస్తున్నారు. బీజేపీ తానూ రెండు నియోజకవర్గాలకు నేతృత్వం వహిస్తున్న కారణంగా మొన్నటి అసెంబ్లీ ఎన్నికల కన్నా రెట్టింపు ఓట్లను సాధించాలని గట్టిగా ప్రయత్నిస్తోంది. ఈ ఎన్నికల్లో మెజార్టీ రెండింతలు సాధించి తన ఆధిపత్యం తగ్గలేదన్న సంకేతాన్ని పంపాలని భావిస్తోంది. అలాగే కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలో ఉండడం ఖానాపూర్ నియోజకవర్గానికి నేతృత్వం వహిస్తున్నందున ఈ ఎన్నికలు తమకు కూడా ప్రతిష్ఠాత్మకమేనని పేర్కొంటున్నాయి. అయితే ఆ పార్టీ నేతలంతా తమ ఇమేజ్‌ను పెంచుకునేందుకు ముమ్మరంగా శ్రమిస్తున్నారు. ఇదిలా ఉండగా మొన్నటి ఎన్నికల్లో ఘోర పరాభావం పొందిన బీఆర్ఎస్ పార్టీ తన రాజకీయ భవిష్యత్‌ను నిలుపుకునేందుకు చావో రేవో అన్న చందంగా ప్రచారాన్ని చేపడుతున్నాయి.

రంగంలోకి అగ్రనేతలు

ఇదిలా ఉండగా కాంగ్రెస్ పార్టీ తరఫున ఇటీవలే రాహుల్ గాంధీ ప్రచారం నిర్వహించడంతో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు సైతం ఇక తమ అగ్రనేతలను రంగంలోకి దించేందుకు నిర్ణయించాయి. రాష్ట్ర జాతీయ స్థాయి నేతలను రప్పించే పనిలో నిమగ్నమయ్యాయి. దీనికి సంబంధించిన రూట్‌మ్యాప్‌లు, షెడ్యూల్‌లను ఖరారు చేసేందుకు కసరత్తు జరుపుతున్నాయి. ఈ నెల 9వ తేదీన నిర్మల్ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ అగ్రనేత కేటీఆర్ పర్యటించనున్నారు. ఆయన పర్యటనతో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకు కొంత ఊపు లభించబోతోందని అంటున్నారు. అయితే బీజేపీ పార్టీ మాత్రం వ్యూహాత్మకంగా తన నేతల పర్యటనలకు సంబంధించిన సమాచారాన్ని బయటకు వెల్లడించడం లేదు. బుధవారం ఆ పార్టీ గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఖానాపూర్‌లో పర్యటించబోతున్నారు. ఈయన పర్యటనకు సంబంధించిన సమాచారాన్ని ఒక రోజు ముందు వరకు పార్టీ నేతలు బయటకు వెల్లడించకుండా జాగ్రత్తలు పాటించారు. ఎదుటి పార్టీలు అలర్ట్ కాకుండా తమ ప్రచారాన్ని వినూత్న శైలిలో కొనసాగించి ఆ పార్టీలకు చెక్ పెట్టాలన్న లక్ష్యంతో బీజేపీ వ్యూహరచన చేస్తోంది. కాంగ్రెస్ పార్టీ సైతం మరికొంతమంది జాతీయ నాయకులను, సినీనటులు, క్రీడాకారులను ప్రచారం కోసం రప్పించే ప్రయత్నాలు చేస్తున్నట్లు పేర్కొంటున్నారు.

మాటల యుద్ధం

కాగా బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నేతలు పరస్పర విమర్శనాస్త్రాలు సంధించుకుంటూ మాటల యుద్ధాన్ని మరిపిస్తున్నారు. మొన్నటి వరకు సంక్షేమ అభివృద్ధి పథకాల పేరిట ఒకరినొకరు దూషించుకున్నారు. ప్రస్తుతం ఆ పరిధిని దాటిపోయారు. తమ పార్టీ నేతలపై వ్యతిరేఖ వ్యాఖ్యలు చేయడం అలాగే వ్యక్తిగత దూషణలకు పాల్పడుతూ ప్రచార పర్వాన్ని పక్కదోవ పట్టిస్తున్నారంటున్నారు. బహిరంగ ప్రచారంలోనే కాకుండా సభా వేదికలపై సైతం ఇలాంటి వ్యాఖ్యలే చేస్తున్నారు. దీనికి తోడు గత పది రోజుల నుంచి సోషల్ మీడియా వేదిక ద్వారా నేతలపై దూషణల పర్వం కొనసాగుతోంది. వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్, టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్ లాంటి సామాజిక మాధ్యమాల ద్వారా ప్రతిరోజూ ఉదయం నుంచి రాత్రి వరకు ఈ దూషణల పర్వంతో పాటు పార్టీల విధానాలు తదితర అంశాలను ప్రస్తావిస్తూ విమర్శలు కొనసాగిస్తున్నారు. సోషల్ మీడియా కోసం మూడు పార్టీలు గ్రామాల వారిగా ఇంచార్జీలను నియమించి తమ హైకమాండ్ అందించే సందేశాలను విస్తృతంగా వైరల్ చేస్తున్నారు. గ్రామస్థాయిలో సోషల్ మీడియా గ్రూపులు ఏర్పాటు చేయడం అలాగే ప్రతిరోజూ ఆ గ్రూపుల్లో జరుగుతున్న చర్చలపై సమీక్షలు చేస్తూ మరుసటి రోజూ కౌంటర్‌లు తయారు చేయడం లాంటి వ్యవహారాలను కొనసాగిస్తున్నారు.

మూడు గ్రామాలకు నిలిచిన
బస్సు సర్వీస్‌ను పునరుద్ధరించాలి

- మునిపెల్లి వయా చింతల్‌చందా బస్సు నడపాలని ప్రజల వినతి

లక్ష్మణచాంద, మే 7 : మునిపెల్లి వయా చింతల్‌చందా బస్సు నడపాలని నిర్మల్ ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్‌కు పలువురు లక్ష్మణచాంద బీజేపీ మండల నాయకులు మంగళవారం విజ్ఞప్తి చేశారు. బస్సు సర్వీస్‌లు లేక మునిపెల్లి, మల్లాపూర్, మాచాపూర్ గ్రామాల ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అందులో పేర్కొన్నారు. ఉదయం ఒకటి, సాయంత్రం ఒకటి వచ్చే సర్వీస్‌లు కూడా నిలుపుదల చేయటం వలన ఈ ఇబ్బందులు ఇంకా అధికమయ్యాయని తెలిపారు. అనునిత్యం మండల కేంద్రానికి బ్యాంకు, ప్రభుత్వ కార్యాలయాలు, వారసంత, ఇతర సేవల కోసం వెళ్లటానికి అసలు ఎలాంటి ప్రయాణ సౌకర్యం లేదని అందువలన మునిపెల్లి వయా చింతల్‌చందా సర్వీస్‌ను ఉదయం, సాయంత్రం కనీసం రెండు ట్రిప్పులు నడపాలని విన్నవించారు. దీనిపై ఆర్టీసీ అధికారులు సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. వినతిపత్రం సమర్పించిన వారిలో అయిండ్ల భూపాల్‌రెడ్డి, సురకంటి ముత్యం రెడ్డి, అడ్వాల రమేష్, అడిచెర్ల రవికుమార్, కమల్‌కోట వెంకట్‌రెడ్డి, దశ గౌడ్, తదితరులు ఉన్నారు.

ఓలాలో చలివేంద్రం ప్రారంభం



ఓలాలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంఈవో

కుంటాల, మే, 7: మండలంలోని ఓలా గ్రామంలో మంగళవారం స్థానిక వాసర సరస్వతి శిశు మందిర్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించారు. గత 13 సంవత్సరాల నుండి వేసవి కాలంలో ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో లోలం గజేందర్ ఆధ్వర్యంలో ఈ చలివేంద్రాన్ని కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగానే మంగళవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో ముత్యం, కుంటాల ఏఎస్ఐ దేవరావు, స్థానికులు సదాశివ్, ఎగ్గాం గణేష్, ఎగ్గాం వినోద్‌తో పాటు పలువురు గ్రామస్థులు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీ గెలిస్తే ప్రతి కుటుంబానికి రూ. 1,30,000

అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్ : డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు



లక్ష్మణచాందలో మాట్లాడుతున్న శ్రీహరిరావు

లక్ష్మణచాంద, మే 7 : కాంగ్రెస్ పార్టీ గెలిస్తే ప్రతి కుటుంబానికి 1,30,000ల నగదు మొత్తాన్ని బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు మంగళవారం అన్నారు. అలాగే భారతదేశానికి స్వాతంత్ర్యాన్ని తెచ్చింది.. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చింది కాంగ్రెస్ పార్టీయేనని ఆయన గుర్తు చేశారు. మండల కేంద్రమైన లక్ష్మణచాంద, చింతల్‌చందా, చామన్‌పెల్లి గ్రామాల్లో ఆయన కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణ తరఫున ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ ఆరు గ్యారంటీలతో పాటు ఐదు న్యాయాలు అమలు కావాలన్నా... రాజ్యాంగం పరిరక్షించబడాలన్నా... రిజర్వేషన్లు పదిలంగా ఉండాలన్న కాంగ్రెస్ పార్టీని గెలిపించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తే కేంద్ర ప్రభుత్వం తరఫున 1,00,000 రూపాయలు, రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రతి నెల 2500లు సంవత్సరానికి 30,000 మొత్తం ఒక లక్ష ముప్పై వేలు అర్హులైన ప్రతి కుటుంబానికి అందజేస్తామన్నారు. అంతేకాకుండా రిజర్వేషన్ పరిమితిని పెంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్ పెంచడంతో పాటు అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్ కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఓడ్నాల రాజేశ్వర్, నాయకులు ఈటెల శ్రీనివాస్, అట్ల రవీందర్‌రెడ్డి, కొంద్ర నరేష్‌రెడ్డి, అట్ల రాంరెడ్డి, గురాల లింగారెడ్డి, నగేష్, తదితరులున్నారు.

ఓటు హక్కు ప్రతీ ఒక్కరూ వినియోగించుకోవాలి

- కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్



నిర్మల్‌లో 5కే రన్ ప్రారంభిస్తున్న కలెక్టర్

నిర్మల్ కల్చరల్, మే 7 : పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఈ నెల 13న ఓటు వేసి వినియోగించుకోవాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ పిలుపునిచ్చారు. మంగళవారం నిర్మల్‌లోని ఆర్డీవో కార్యాలయం నుండి 5కే రన్ జెండా ఊపి ప్రారంభించారు. అంబేద్కర్ విగ్రహం వరకు రన్ కొనసాగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఓటు హక్కు దేశ ప్రజలకు రాజ్యాంగం కల్పించిన గొప్ప ఆయుధమన్నారు. గత ఎన్నికల్లో పట్టణ కేంద్రాల్లో ఓటింగ్ తక్కువ శాతం నమోదైందన్నారు. ఈసారి ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకొని ఓటింగ్ శాతం పెంచాలన్నారు. ఓటు హక్కుపై ఇప్పటికే స్వీప్ కార్యక్రమాలు నిర్వహించి ఓటర్లను చైతన్యం చేస్తున్నామని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా ఉండేం దుకు ఓటర్లకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. టెంట్ల ఏర్పాటు, తాగునీరు. బెంచీలు, వికలాంగులకు ర్యాంపులు, వీల్‌చైర్లు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు కిషోర్ కుమార్, ఫైజాన్ అహ్మద్, డీఆర్‌వో భుజంగరావు, డీఆర్డీవో విజయలక్ష్మి, డీఈవో రవీందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఈదురు గాలుల భీభత్సం.. రైతుల అవస్థలు



కుంటాలలో ధాన్యం కుప్పలపై నుంచి లేచిపోయిన టార్పాలిన్‌లు

కుంటాల, మే, 7: మండలంలో మంగళవారం ఈదురు గాలులు భీభత్సం సృష్టించాయి. సాయంత్రంపూట ఒక్కసారిగా ఈదురు గాలులు రావడంతో కల్లాల్లో ఉన్న రైతుల యొక్క జొన్న, వరి, మొక్కజొన్న తదితర ధాన్యాలపై ఉన్న టార్పాలిన్‌లు ఎగిరిపోయాయి. గత 15 రోజుల నుంచి అడపదడప ఈదురు గాలులు, వర్షాలు కురుస్తుండడం , గత వారం రోజుల నుండి తగుముఖం పట్టిన వర్షాలు మంగళవారం ఒక్కసారిగా బలంగా ఈదురుగాలులు వీయడంతో కల్లాల్లో ధాన్యం ఉన్న రైతులు నానా అవస్థలు పడ్డారు. ధాన్యం తడిసిపోతే తీరని నష్టం ఏర్పడుతుందని ఆందోళన చెందారు. ధాన్యాన్ని ప్రభుత్వం త్వరగా కొనుగోలు చేయాలని రైతులు వేడుకుంటున్నారు.

కూలిన ఇళ్లు

దిలావర్‌పూర్ : మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం వీచిన ఈదురు గాలులకు ఓ నిరుపేద కుటుంబం రోడ్డున పడింది. మండల కేంద్రంలో వెంకటరమణ, ఆయన తల్లి వృద్ధురాలు ఇద్దరు ఒక చిన్న రేకుల షెడ్డులో నివసిస్తున్నారు. వెంకటరమణ కూలీనాలీ చేస్తే వృద్ధురాలైన తల్లిని పోషిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం అకస్మాత్తుగా వచ్చిన బలమైన ఈదురు గాలులతో ఇళ్లు పూర్తిగా నేల మట్టమైంది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు వేడుకుంటున్నారు.

ఇదిలా ఉండగా ఈదురుగాలులకు పలుచోట్ల చెట్లు విరిగిపడ్డాయి. దుమ్ము.. దూళితో కూడిన గాలులు వీయడంతో ద్విచక్రవాహనదారులు అవస్థలు పడ్డారు. ఎక్కడ ఏ ప్రమాదం జరుగుతుందోనని ఇంటి నుంచి బయటకు వెళ్లిన వారు ఆందోళన చెందారు. విద్యుత్ సరఫరా తరచూ నిలిచిపోయింది. దీంతో ఉక్కపోతతో ప్రజలు అవస్థలు పడ్డారు.



ఈదురు గాలులకు కూలిన ఇల్లు

'గెలుపు కోసం సమిష్టిగా కృషి చేయాలి'

దిలావర్‌పూర్, మే 7 : కార్యకర్తలంతా సమిష్టిగా కృషి చేసి కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపిద్దామని మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. మంగళవారం సిర్గాపూర్‌లోని రుక్మారెడ్డి గార్డెన్‌లో జరిగిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. మనలో ఉన్న విభేదాలను పక్కనపెట్టి సుగుణను ఎంపీగా గెలిపించి రాహుల్‌గాంధీ, సోనియా గాంధీలకు కానుకగా ఇద్దామన్నారు. రాహుల్‌గాంధీ ప్రధానమంత్రిని చేద్దామన్నారు. ప్రతి కార్యకర్త తానే ఎంపీ అభ్యర్థిగా భావించి గెలుపుకోసం కష్టపడదామన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి సుగుణను గెలిపిస్తే నిర్మల్‌కు రైల్వేలైన్ తెప్పించే బాధ్యత తీసుకుంటానని చెప్పారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు కండెల శ్రీనివాస్ రెడ్డి, అరుణ్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలు ఇంద్రకరణ్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వీవీ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వలలో చిక్కుకొని ఒకరి మృతి



దత్త్రాతి మృతదేహం

భైంసా రూరల్, మే 7 : చేపల వేటకు వెళ్లి ఓ వ్యక్తి ప్రమాదవశాత్తు వల శరీరానికి చుట్టుకోవడంతో మృతి చెందాడు. రూరల్ ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం కుభీర్ మండలం పాంగ్రా గ్రామానికి చెందిన ఉట్నూర్ దత్త్రాత్రి(46) వృత్తి రీత్యా చేపలు పట్టేవాడు. ఈ నెల 5వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు చేపల వేటకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరాడు. ఆ రోజు సాయంత్రం 6 గంటలకు కుటుంబీకులు దత్త్రాత్రికి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. అప్పటి నుంచి చుట్టు పక్కల గ్రామాల్లో వెతుకగా ఆచూకీ లభించలేదు. మంగళవారం మండలంలోని లింగా గ్రామం వద్ద చేపల వేటకు వెళ్లిన తోకల శంకర్‌కు నీటిలో తేలియాడుతున్న శవం కనిపించగా కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. చేపల వల శరీరానికి చుట్టుకోవడంతో నీటిలో మునిగి మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. కుటుంబికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

కోనేరులో మునిగి వృద్ధుడి మృతి



రామస్వామి మృతదేహం

దిలావర్‌పూర్, మే 7 : మండల కేంద్రంలోని ప్రసిద్ధ రేణుక ఎల్లమ్మ తల్లి కోనేరులో మునిగి ఈత రాక వృద్ధుడు మృతి చెందాడు. దిలావర్‌పూర్ ఎస్సై సుమాంజలి తెలిపిన వివరాల ప్రకారం... కుటుంబాల మండలం కల్లూర్ గ్రామానికి చెందిన మల్లెల రామస్వామి(70) కూతుళ్లు దిలావర్‌పూర్ ఎల్లమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకునేందుకు వచ్చారు. కూతుళ్లతో పాటు రామస్వామి వచ్చారు. స్నానం చేసేందుకు రామస్వామి కోనేరులో దిగారు. ప్రమాదవశాత్తు జారీ కోనేరు మధ్యలోకి వెళ్లాడు. ఈత రాకపోవడంతో నీటిలో మునిగి మృతి చెందినట్లు ఎస్సై సుమాంజలి తెలిపారు. కాగా మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ధర్మరక్షణకు హిందువులంతా

కంకణ బద్ధులవ్వాలి

● అఖిల భారత హనుమాద్దీక్షా పీఠాధిపతి దుర్గాప్రసాద్‌స్వామి




పీఠాధిపతి దుర్గాప్రసాద్‌స్వామి అనుగ్రహ భాషణం.. కార్యక్రమంలో హనుమత్ దీక్షా భక్తులు

భైంసా, మే 7 : పాశ్చాత్యధోరణి విధానాలు, ఆధునిక పోకడలతో దెబ్బతింటున్న సనాతనమైన ధర్మ సంరక్షణకు, సంస్కృతి పరిరక్షణకు హిందువులంతా కంకణబద్ధులవ్వాలని అఖిల భారత హనుమాద్దీక్షా పీఠాధిపతి దుర్గాప్రసాద్‌స్వామి పిలుపునిచ్చారు. మంగళవారం భైంసాలోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో జరిగిన లక్ష హనుమాన్ చాలీసా పారాయణంలో పాల్గొని మాట్లాడారు. ప్రతి హిందువు నిత్యం ఆలయాల సందర్శన చేపట్టి భక్తి, భావాలతో నడుచుకోవాలన్నారు. ఆధ్యాత్మికతతో వ్యవహరిస్తే అన్నింటా సత్ఫలితాలు ఉంటాయన్నారు. ప్రతీఒకరూ సేవాభావాలను అలవర్చుకోవాలన్నారు. ఆంజనేయ నామస్మరణంతో కష్టనష్టాలు దూరమవుతాయన్నారు. విశ్వశాంతి కొరకు లక్ష హనుమాన్ చాలీసా మహాయజ్ఞం చేపట్టినట్లుగా వివరించారు. హనుమంతునిలోని సద్గుణాలను శ్రీ హనుమద్దీక్షా భక్తులు, యువతీ,యువకుల ద్వారా దేశరక్షణ, దేవాలయాల సంరక్షణ, స్త్రీ సంరక్షణ, గోవుల రక్షణ, సనాతన హిందూ ధర్మ రక్షణకు కార్యక్రమాలు చేపట్టినట్లుగా పేర్కొన్నారు. ఇందులో భాగంగానే శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో చేపట్టిన లక్ష హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని హనుమాన్ దీక్షాదారులు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధి సాధుల కృష్ణదాస్, విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు డా.మహిపాల్, గుజ్జల్‌వార్ వెంకటేశ్, డా, రామకృష్ణగౌడ్, పెరుగు నవీర్, గో పరిరక్షణ్ ప్రతినిధులు నూకల సురేష్‌తో పాటు పలు హిందూ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



పారాయణం కార్యక్రమంలో పాల్గొన్న మహిళా భక్తులు

నేడు ఖానాపూర్‌కు

గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ రాక

● సాయంత్రం 4 గంటలకు బైక్ ర్యాలీ

ఖానాపూర్, మే 7 : పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ఖానాపూర్ రానున్నట్లు బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు కూనంటి అంజుకుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా బుదవారం సాయంత్రం నాలుగు గంటలకు రాజాసింగ్ ఖానాపూర్ చేరుకుంటారని పేర్కొన్నారు. స్థానిక సాయిబాబా మందిరం నుండి బస్టాండ్ వరకు 3 వేల బైక్‌లతో బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. బైక్ ర్యాలీ అనంతరం ఖానాపూర్ పట్టణంలోని బస్టాండ్ సమీపంలో కార్నర్ మీటింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. రాజాసింగ్ పర్యటనలో ఎంపీ అభ్యర్థి గెడం నగేష్, మాజీ ఎంపీ రమేష్ రాథోడ్ పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సామ రాజేశ్వర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు రితీష్ రాథోడ్, నియోజకవర్గ కన్వీనర్ అంకం మహేందర్ తదితరులున్నారు.

రాజాసింగ్ ర్యాలీని విజయవంతం చేయండి

నేరడిగొండ : బుధవారం ఇచ్చోడ మండల కేంద్రంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి గోడం నగేష్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించడానికి గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ముఖ్య అతిథిగా పాల్గొంటున్నారని బీజేపీ నేరడిగొండ మండల అధ్యక్షులు సాబ్లె సంతోష్‌సింగ్ తెలిపారు. ఈ ర్యాలీలో మండలంలో గల ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలు, అభిమానులు, యువతి యువకులు, ప్రజలు, మహిళలు పాల్గొనాలని కోరారు.

ఇచ్చే పెన్షన్‌లో డబ్బుల కోత

● పోస్టల్ సిబ్బంది చేతివాటంపై లబ్ధిదారుల ఆగ్రహం

బోథ్, మే 7: రాష్ట్రప్రభుత్వం వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు ఒంటరి మహిళలకు అండగా నిలిచి పెన్షన్‌లను ఇస్తుంది. అయితే ప్రభుత్వపరంగా వచ్చిన పెన్షన్లు లబ్ధిదారులకు రావాల్సిన మొత్తం అందడం లేదు. దీంతో లబ్ధిదారులు రెండు వేల రూపాయలతో సరిపెట్టుకోవాల్సి వస్తుంది. పైన వచ్చే 16 రూపాయలను పోస్టల్ సిబ్బంది స్వాహా చేస్తున్నారని వాపోతున్నారు. గతంలో సైతం 16 రూపాయల చిల్లర పైసలు ఇవ్వడం లేదని వార్త కథనాలు రావడంతో కొన్ని గ్రామాల్లో సిబ్బంది 16 రూపాయలు ఒక నెలపాటు ఇవ్వడం జరిగింది. ఆ తరువాత యధావిధిగా పెన్షన్‌దారులకు రావాల్సిన 16 రూపాయలు పోస్టల్ సిబ్బంది స్వాహా చేస్తున్నారు. చిల్లర అడిగితే తన వద్ద చిల్లర లేవు.. మళ్లీ ఇస్తాను దాటవేస్తున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. ఫలితంగా మండలంలోని ఒక్కో పోస్టు మాస్టర్‌కు ఒక లక్ష రూపాయల వరకు ప్రతీనెల ఆదాయం వస్తుంది. ఈ తతంగం అంతా పోస్టల్‌శాఖ అధికారులకు తెలిసినా తూతూ మంత్రంగా ప్రజల్లోకి వెళ్లి వివరాలు సేకరించి వెళ్లిపోతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. గతంలో గ్రామంలో విచారణకు వచ్చిన అధికారులకు వివరాలు చెప్పనీయకుండా కొంత మంది అబద్దాలను తమ వైపు తిప్పుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. ఏది ఏమైనా పోస్టల్‌శాఖ సిబ్బంది అవినీతిపై ఉన్నతాధికారులు గోప్యంగా విచారణ జరిపితే వాస్తవాలు బయటికి వస్తాయి.

బీజేపీలో చేరిన ఆమ్ ఆద్మీ నాయకుడు

బోథ్, మే 7: నియోజకవర్గ ఆమ్ ఆద్మీ పార్టీ మండల కన్వీనర్ శ్రీకాంత్ యాదవ్ మంగళవారం బీజేపీ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన ఈయనకు బీజేపీ కండువా వేసి బీజేపీ మండల పార్టీ కన్వీనర్ బోరే రవీందర్ స్వాగతించారు. కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ కదం ప్రశాంత్‌తో పాటు బీజేపీ సీనియర్ నాయకులు శుభసూర్య పాల్గొన్నారు. నూతనంగా బీజేపీలో చేరిన శ్రీకాంత్ యాదవ్ మాట్లాడుతూ భారతీయ జనతాపార్టీ ఆధ్వర్యంలో చేపడుతున్న సంక్షేమ పథకాలు పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. కాగా బీజేపీ నాయకులు మంగళవారం బోథ్ మండల కేంద్రంతో పాటు పిప్పలదరి, కౌట బి, పోచ్చెరా, గ్రామాల్లో బీజేపీ పార్టీ ప్రచారాన్ని చేపట్టారు. పిప్పల్దారి గ్రామంలో దక్షిణ మధ్య రైల్వే బోర్డు సభ్యులు జీవీ రమణ మరల పెళ్లి గ్రామాల్లో ఆ పార్టీ నాయకులు అనిల్ అప్ప తుకారంలతో పాటుగా మండల పార్టీ కన్వీనర్ బోర రవీందర్, బీజేపీ సీనియర్ నాయకులు డాక్టర్ అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాది పేదల పార్టీ : రాములు నాయక్

నేరడిగొండ, మే 7: కాంగ్రెస్ పేదల పార్టీ అని మాజీ ఎమ్మెల్సీ రాముల్‌నాయక్ పేర్కొన్నారు. నేరడిగొండ మండల కేంద్రంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆగస్టు 15 నాటికి రూ.2లక్షల రుణమాఫీ, వచ్చే సీజన్ నుంచి వరికి రూ.500 బోనస్ ఇస్తుందని ఇది వరకే ప్రకటించిందని తెలిపారు. తమ పార్టీ ఎంపీ అభ్యర్థి ఆత్రంసుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అప్పుడే రాష్ట్రంలో మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు.

వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి

భీంపూర్, మే 7: తీవ్రమైన ఎండలకు ఉపాధి హామీ కూలీ మృతి చెందిన సంఘటన భీంపూర్ మండలంలో చోటు చేసుకుంది. వివవరాలు మం దలంలోని ఆర్లి(టి) గ్రామానికి చెందిన మస్కాఫూర్ ఇస్తరి(35) ఆదిలా బాద్ రిమ్స్‌లో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. ఇతను రోజు మాదిరిగానే శనివారం ఎండలలో ఉపాధి హామీ పనులు చేసి వచ్చారు. ఇంటికి వచ్చిన తరువాత వాంతులు చేసుకోవడంతో స్థానికులు 108లో ఆదిలా బాద్ రిమ్స్ పంపారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందా డు. ఆయనకు భార్య ఉంది. నిరుపేద కుటుంబానికి చెందిన ఇస్తారీ మృతి తో గ్రామంలో విషాదఛాయాలు నెలకొన్నాయి. అధికారులు ఉపాధి హామీ పని ప్రదేశంలో ప్రకారం కూలీలకు నీడ, మంచి నీటి సౌకర్యం కల్పించ డం, అందుబాటులో ప్రథమ చికిత్స మందులు ఉంచకపోవడంతోనే ఇలా జరిగిందని కుటుంబీకులు అంటున్నారు. ప్రభుత్వం బాధిత కుటాంబానికి రూ.పది లక్షల పరిహారం ఇవ్వాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు.

అనారోగ్యంతో రైతు ఆత్మహత్య


ఇస్తరి(ఫైల్)

భీంపూర్, మే 7: తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్న ఆదర్శ రైతు ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... పిప్పల్‌కోటి గ్రామానికి చెందిన మస్కారి గంగయ్య (58) మంచి పంటలు తీస్తూ ఆదర్శ రైతుగా గుర్తింపు పొందారు. అయితే కొన్నేళ్లుగా కిడ్నీలు చెడిపోయి డయాలసిస్ చేయించుకుంటున్నారు. ఈ క్రమంలో అనారోగ్యంతో విసుగు చెంది గత శనివారం ఆదిలాబాద్‌కి వచ్చి రైల్వే స్టేషన్ సమీప ఆటో అడ్డ వద్ద పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లారు. గమనించిన ఆటో డ్రైవర్లు 108కు ఫోన్ చేసి ఆదిలాబాద్ రిమ్స్‌లో చేర్పించారు. గంగయ్య చికిత్స పొందుతు మంగళవారం ఉదయం మృతి చెందాడు. ఆయనకు భార్య రుకుంబాయి, ఇద్దరు కూతుళ్ల ఉన్నారు

● విషాదంలో దాతృత్వం

కుటుంబ పెద్దను కొల్పోయిన దుఖంలో ఉన్న కూడా భార్య, కూతుళ్ల అన్న కుమారులు ప్రవీణ్, రవికాంత్‌లు పెద్ద మనసు చేసి తమ దాతృత్వం చాటుకున్నారు. ఎల్వీ ప్రసాద్ ఇనిస్టిట్యూట్ వారికి గంగయ్య నేత్రదానం చేసి మానవత్వం చాటుకున్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

● జిల్లా సంక్షేమశాఖ అధికారి భాస్కర్


మాట్లాడుతున్న జిల్లా సంక్షేమశాఖా అధికారి భాస్కర్

ఆసిఫాబాద్, మే 7: బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవా లని జిల్లా స్త్రీశిశు, వయోవృద్ధుల సంక్షేమ శాఖాధికారి భాస్కర్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో బాల్య వివాహాల నియంత్రణపై ఏర్పాటు చేసిన సమన్వయ సమావేశానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి తుకారాంభట్, బాలల సంక్షేమ సమితి ఛైర్మన్ వెంకటస్వామి, జిల్లా విద్యాశాఖాధికారి అశోక్, డీఎల్‌పీవో సురేష్‌బాబుతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో బాల్య వివాహాల నియంత్రణకు పాటుపడాలన్నారు. ఈ క్రమంలో అన్ని శాఖల అధికారులు సహకరించాలని తెలిపారు. బాల్య వివాహాలు సామాజిక సమస్య అని, సమాజ చైతన్యంతోనే అరికట్టవచ్చని చెప్పారు. జిల్లాలో అనుబంధ శాఖలన్నీ సమన్వయంతో పని చేయడం ద్వారా బాల్య వివాహాల నిర్మూలన సాధ్యమవుతుందని తెలిపారు. వయసు నిర్ధారణ కోసం పాఠశాల నుంచి బోనఫైడ్ సర్టిఫికెట్ జారీ చేసేందుకు జిల్లాలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయు లకు ఆదేశాలు జారీ చేశామని వివరించారు. అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో సమన్వయంతో పని చేసి బాల్య వివాహాల నిర్మూలన కోసం కృషి చేయాలని తెలిపారు. బాల్య వివాహాల కారణంగా అనేక ఆరోగ్య మానసిక సమస్యలు ఎదు రవుతాయని ఆశా కార్యకర్తలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు సమ స్యలను గుర్తించి ఎదురయ్యే ఇబ్బందులను కౌన్సెలింగ్ ద్వారా తెలియజేయాలని సూచించారు. సమావేశంలో బాలల సంక్షేమ సమితి సభ్యులు దశరథ్, సమీర్, అధికారులు రామకృష్ణ, మజార్ ఉన్నీసాబేగం, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కూలీలు సద్వినియోగం చేసుకోవాలి

కెరమెరి, మే 7: ఉపాధిహామీ పనులకు కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కృష్ణారావు అన్నారు. మంగళవారం ఆయన ఆంద్‌గూడ, కరంజివాడ గ్రామాల్లో జరుగుతున్న పనులను పరిశీలించిన అనంతరం గ్రామస్థులతో మాట్లాడారు. కూలీల శాతాన్ని పెంచేందుకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం వలసల నివారణకు ఈజీఎస్ పథకాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. దీన్ని అర్హులైన కూలీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఏపీవో మల్లయ్య, సిబ్బంది తదితరులు ఉన్నారు.

పల్లె ఓటర్లపైనే పార్టీల దృష్టి

● గత అసెంబ్లీ ఎన్నికలలో తక్కువగా పోలింగ్

● గ్రామాల్లో జోరుగా ప్రధాన పార్టీల ప్రచారం



ఆసిఫాబాద్‌రూరల్, మే 7: పార్లమెంట్ ఎన్నికలకు గడు వు సమీపిస్తుం డటంతో ప్రధా న పార్టీలన్నీ ప్రచారంలో వేగం పెంచాయి. కాంగ్రెస్, బీ ఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల ఓటర్ల మద్దతు కూడ గట్టేం దుకే ప్రాధాన్యం ఇస్తున్నారు. గత అసెంబ్లీ ఎన్నికలలో పట్ట ణ ప్రాంతాల్లో పోలిం గ్ శాతం తక్కువగా నమోదు కావడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. ఇప్పటి వరకు జరిగిన అసెంబ్లీ ఎన్నికలతో పాటు 2023లో అసెంబ్లీ ఎన్నికలలో పట్టణ ప్రాంతాల్లో 70 శాతనికి మించి పోలింగ్ నమోదు కాలేదు. గ్రామీణ ప్రాంతాల్లో 75 నుంచి 80 శాతం నమోదైంది. దీంతో పార్టీలన్నీ పల్లె ఓటర్లపైనే ఆశలు పెట్టు కున్నారు.

రెండు నియోజకవర్గల పరిధిలో..

కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజక వర్గాలలో గత అసెంబ్లీ ఎన్నికలలో మండలాల వారిగా నమోదైన పోలింగ్‌శాతం ఈ విధంగా ఉంది. ఆసిఫాబాద్‌లో 85.44 శాతం, గాది గూడలో 80.76, జైనూర్‌లో 79.55, కెర మెరిలో 81.67, లింగాపూర్‌లో 81.55, నార్నూర్‌లో 76.88, రెబ్బెనలో 82.92, సిర్పూర్ (యూ)లో 84.44, తిర్యాణిలో 80.67, వాంకిడిలో 80.34 పోలిం గ్ శాతం పోలింగ్ నమోదైంది. అలాగే సిర్పూర్ నియోజకవర్గంలో 81.89 పోలింగ్ శాతం నమోదైంది.

ప్రధాన పార్టీలు..

పార్లమెంట్ స్థానంలో పాగా వేసేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు సర్వశక్తులు ఒడ్డుతున్నాయి. ప్రత్యర్థి పార్టీల ప్రచారసరళిని గమనిస్తూ ఎత్తుకు పైఎత్తులు వేస్తూ ప్రచారం సాగి స్తున్నాయి. ఇందు లో భాగంగానే మూడు పార్టీలు పల్లెల్లో ఇంటింటి ప్రచారం చేపడు తున్నాయి. ఉదయం, సాయంత్రం వేళల్లో ఓటర్లకు తమ పార్టీల విధా నాలు వివరిస్తూ ఓట్లను అభ్యర్థిస్తున్నాయి. కూలీలు ఉపాధి పనులకు వెళ్తుండడంతో రాజకీయ పార్టీల నాయకులు ఓట్లు అభ్యర్థిస్తున్నారు.

ఆదిలాబాద్‌లో వడగండ్ల వాన

● ఇంద్రవెల్లి, తలమడుగు మండలాల్లో ఈదురుగాలుల బీభత్సం ● పలుచోట్ల విరిగిపడిన చెట్లు ● ఎండల నుంచి ఉపశమనం!


ఇంద్రవెల్లి మండలంలో కురుస్తున్న వడగండ్ల వాన



ఆదిలాబాద్, మే 7(ఆంధ్రజ్యోతి): గత కొద్ది రోజులుగా రారెత్తిస్తున్న ఎండలతో ఉక్కిరిబిక్కిరవుతున్న జనానికి కాస్త ఉపశమనం కలిగింది. మంగళవారం మధ్యాహ్నం సమయంలో వాతావరణం ఒక్కసారిగా చల్ల బడి ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వాన కురిసింది. దీంతో ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా వాతావరణం పూర్తిగా చల్లబడిపోయింది. ముఖ్యంగా ఇంద్రవెల్లి, సిరికొండ, ఇచ్చోడ, బజార్‌హత్నూర్, తలమడుగు మండలాల్లో వడగండ్ల వాన అకస్మాత్తుగా కురవడంతో రైతులు ఆందోళ నకు గురయ్యారు. ఇప్పటికే చేతికి వచ్చిన జొన్న పంటను నూర్పిడి చేసి అమ్మేందుకు ఆరబెడుతున్నారు. వడగండ్ల వానతో రైతులు కొద్దిసేపు ఉరుకులు, పరుగులు పెట్టారు. టార్పాలిన్ కవర్లతో పంటను కాపాడుకు నేందుకు ప్రయత్నాలు చేశారు. కొన్ని చోట్ల ఇంటి పై కప్పులు, గుడి సెలు ఎగిరిపడ్డాయి. ఈదురు గాలుల బీభత్సవానికి దాదాపుగా గంటకు పైగా విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. పెద్దగా పంట నష్టం జరుగక పోయిన కల్లాలపై ఆరబెట్టిన గోధుమ పంట తడిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు భానుడి భగభగలతో ఉష్ణోగ్రతల తీవ్రత కనిపించింది. మధ్యాహ్నం నుంచి వాతావరణం చల్లబడింది. ఆ దిలాబాద్ జిల్లా సగటు గరిష్ఠ ఉష్ణోగ్రత 43.8 డిగ్రీలు కాగా కనిష్ఠ ఉ ష్ణోగ్రతలు 30.2 డిగ్రీలుగా నమోదయ్యాయి. సిరికొండ మండలంలో గరిష్ఠంగా 45.4 డిగ్రీలు, తాంసి మండలంలో 45.0 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ఈ రెండు మండలాల్లో రెడ్‌అలర్ట్‌ను ప్రకటించారు. అలాగే ఆదిలాబాద్‌రూరల్ మండలంలో 44.3, బేల మండలంలో 43.7, గుడిహత్నూర్‌లో 42.8, బజార్హత్నూర్‌లో 41.5, గాదిగూడలో 40.9 ఉష్ణోగ్రతలు నమోద య్యాయి. గత కొద్దిరోజులుగా జిల్లా వ్యా ప్తంగా 40 డిగ్రీలకు పైగానే గరిష్ఠ ఉష్ణో గ్రతలు నమోదవుతున్నాయి. మరో రెం డు రోజుల పాటు జిల్లాకు వర్ష సూచన ఉన్నట్లు వాతావరణ శాఖ నిపుణులు పే ర్కొంటున్నారు.

● మిట్టమధ్యాహ్నం పల్లి(కె)లో రాళ్ల వర్షం

తలమడుగు: మే నెల ప్రారంభంతో మరింత ఎండ లు ముదిరి జన జీవనం ఎండ వేడిమి తట్టుకోలేక అతలా కుతలమయ్యారు. మంగళవారం మిట్టమధ్యాహ్నం మండలంలోని పల్లి(బి), పల్లి(కె) గ్రామాలలో మధ్యాహ్నం భారీగా రాళ్ల వర్షం కురవడంతో రైతులు గ్రామస్థులు ఆందోళన కు గురాయ్యరు. రైతుల పండించిన జొన్నలు, మార్కెట్ తీసుకెళ్లేం దుకు ఆరు బయట ఆరబెట్టగా ఉన్నట్టుండి వర్షం రావడంతో జొన్నలు తడవకుండా కాపాడుకునేందుకు రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొ న్నారు. అంతేకాకుండా అకాల రాళ్ల వర్షంతో వర్షానికి తట్టుకోలేక మూగ జీవులు అల్లాడిపోయాయి. ఈదురు గాలులు దాటికి గ్రామాల్లోకి కొంత మంది నివాస గృహంలో పై కప్పులు ఎగిరి పోయాయని గ్రామస్థులు పేర్కొన్నారు. వేడి నుంచి కొంత ఉపశమనం లభిం చినప్పటికీ.. అకాల వర్షం కూడా కొంత మంది రైతు లకు ఇబ్బందులు తప్పలేదు.

● ఆయా గ్రామాల్లో కురిసిన వర్షం

ఇంద్రవెల్లి: అధిక ఉష్ణోగ్రతలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న జనం ఒక్కసారిగా చల్లబడ్డారు. మంగళవారం మధ్యాహ్నం మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో వర్షం కొద్ది నిమిషాలు కురిసింది. దీంతో ఎండకు మాడిపోతున్న జనానికి రాళ్ల వాన కాస్త ఉపశమనం కలిగించింది. ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడం వల్ల కొద్దిసేపు విద్యుత్‌సరఫరాకు అంతరాయం కలిగింది. మండలంలోని దస్నాపూర్ గ్రామంలో ఉరుములు, మెరుపులతో కూడిన రాళ్ల వర్షం కురిసింది. వర్షంతో ఎలాంటి నష్టం వాటిళ్లలేదు.



తలమడుగులో కురిసిన వడగండ్లను చూపుతున్న రైతు


ఆరుబయట ఆరబెట్టిన జొన్నలపై టాటిపత్రి కప్పుతున్న రైతు


దస్నాపూర్‌లో పడ్డ వడగండ్లను చూపుతున్న దృశ్యం

మండుతున్న ఎండలు.. పెరుగుతున్న వడదెబ్బ బాధితులు

బోథ్, మే 7: మండలంలో వడదెబ్బ బాధితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతుంది. తీవ్రమైన ఎండల వల్ల ప్రజలు వడదెబ్బకు గురవుతు న్నారు. ఉపాధి హామీ పనులకు వెళ్లి ఇప్పటికే ఒకరు మృత్యువాత పడ్డారు. మండలంలో ఉపాధిహామీ పనులు చేపట్టేందుకు దాదాపు ప్రతిరోజు 7 వేల మందిపైగా వెళుతున్నారు. మండుటెండలను సైతం లెక్క చేయకుండా పనులకు వెళ్లడంతో ప్రజలు వడదెబ్బ బారిన పడుతు న్నారు. మరోవైపు రైతులు సాయంత్రం పూట తమతమ పొలాలలో పనులు చేసుకునేందుకు వెళుతున్న వడగాలుల తీవ్రత వల్ల వడదెబ్బకు గురవుతున్నారు. గతవారం రోజులుగా బోథ్ సివిల్ ఆసుపత్రిలో ప్రతీరోజు 400కుపైగా అవుట్ పేషెంట్లు వైద్యపరీక్షల కోసం వస్తున్నారు. దీంతో రోగులకు ఆసుపత్రిలో బెడ్‌లు సరిపోవడం లేదు. జ్వరాలతో పాటు వడ దెబ్బ బారిన ఉదయం నుంచి రాత్రి వరకు రోగుల ఆసుపత్రికి వస్తున్నా రు. ముఖ్యంగా రాత్రిపూట వడదెబ్బ బాధితుల తాకిడి ఎక్కువగా ఉందని వైద్యులు అంటున్నారు.

● తగు జాగ్రత్తలు తప్పనిసరి

మండలంలో ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున ప్రజలు ముఖ్యంగా రైతులు కూలీలు వడదెబ్బ బారిన పడకుండా తగు జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ రవీంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఎండల తీవ్రత కొనసాగడంతో పాటు వడ గాల్పులు వీస్తున్నందున ప్రజలు బయటకు వెళ్లకుండా ఉండాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు వెళ్లవద్దన్నారు. ఎండ నుంచి రక్షించుకునేందుకు తప్పనిసరిగా క్యాప్‌లను తెల్లని గుడ్డను తలకు కట్టుకోవాలని తెలిపారు. ఎక్కువగా నీరు తాగాలని సూచించారు.


మందుల కోసం క్యూలో నిలబడిన వ్యాధిగ్రస్తులు


బోథ్ ఆసుపత్రిలో రోగులతో నిండిన మంచాలు

వానజల్లులు కురియడంతో చల్లబడ్డ వాతావరణం


కేబీ కాంప్లెక్స్‌లో విరిగిన చెట్లు


నాగపూర్ రోడ్డు పై పడిన చెట్టును తొలగిస్తున్న ప్రజలు

ఉట్నూర్, మే 7: గత కొన్ని నెలలుగా ఉష్ణోగ్రతలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు మంగళవారం కురిసిన అకాలవర్షంతో వాతా వరణం చల్లబడింది. కేవలం పావుగంట మాత్రమే ఈదురు గాలులతో కూడిన వడగళ్ల వాన కురియడంతో ఉట్నూర్ మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో చెట్లు కూలడంతో విద్యుత్ వైర్లు తెగి కరెంట్ అంతరాయం ఏర్పడింది.

విద్యుత్ సిబ్బంది కరెంట్ పునరుద్ధరించడానికి రెండు గంటల సమయం కంటే ఎక్కువ పట్టడంతో విద్యుత్ లేక ప్రజలు ఇబ్బందులు పడ్డప్పటికి వాతావరణం చల్ల పడడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. ఇది ఇలా ఉండగా ఆదిలాబాద్ ఉట్నూర్ ప్రధాన రహదారి పై నాగపూర్ సమీపంలో మెయిన్‌రోడ్‌పై చెట్టు పడి ప ఓవడం వాహనాలు నిలిచిపోయాయి. ప్రజలు చెట్టును తొలగించారు.

ఎండిపోతున్న మత్తడివాగు ప్రాజెక్టు


ప్రాజెక్టులో ఎండిపోయిన నీరు


ఎండిపోయి కనిపిస్తున్న మత్తడివాగు ప్రాజెక్టు

వేసవిలో ఎండలు మండిపోవడంతో మత్తడివాగు ప్రాజెక్టులో నీరంతా ఎండిపోతుంది. ప్రస్తుతం తాగునీటి అవసరాలకు సైతం సరిపోని పరి స్థితి నెలకొంది. ఈ చిత్రంలో కనిపిస్తున్న మత్తడివాగు ప్రాజెక్టు దుస్థితి ఇది. నీరంతా ఎండిపోయి భూమి నెర్రెలు వాచి కనిపిస్తోంది. వర్షాలు త్వరగా రాకుంటే మరింత దుర్భిక్ష పరిస్థితి తలెత్తుతుందని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. తాగునీరు.. సాగునీరు దొరకక ప్రజలు అవస్థలు పడుతున్నారు. పశుపక్షాదులు.. ప్రాజెక్టు లోని చేపలు నీరు లేక కనిపించకుండా పోయాయి. పశువులకు దాహార్తి తీర్చేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. మేకలు.. గొర్రెల కాపర్లు ఉన్న బురద నీటితోనే సరిపెట్టుకుంటున్నారు. భూమి ఎక్కడికక్కడ నెర్రెలు రావడంతో ఉన్న నీటి వరకు చేరుకునేందుకు నానా తంటాలు పడాల్సి వస్తుంది. పశువుల కాళ్ల గిట్టలు నెర్రెలలలో కూరుకుపోతున్నాయి. ప్రాజెక్టు వద్ద వాతావ రణం వాసన కూడా మారిపోయింది.

(- ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్)



పార్లమెంట్ పరిధిలో.. హోరాహోరీ

- ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ప్రధాన పార్టీల మధ్యనే త్రిముఖ పోటీ
- ఇండిపెండెంట్‌లతో అభ్యర్థులకు కొత్త టెన్షన్
- ఎన్నికల్లో నోటాకు పెరుగుతూ వస్తున్న ఓటు బ్యాంకు
- గుర్తింపు పొందిన పార్టీ అభ్యర్థుల ప్రభావంపై ఆరా
- లోక్‌సభ పరిధిలో రోజురోజుకూ మారుతున్న రాజకీయ సమీకరణలు

ఆదిలాబాద్, మే 7(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో గెలిచేందుకు ప్రధాన పార్టీల అభ్యర్థులు హోరాహోరీగా ఫైట్ చేస్తున్నారు. ఎన్నికల ప్రచారం తుదిదశకు చేరుకోవడంతో విమర్శనాస్త్రాలకు మరింత పదును పెడుతున్నారు. ఎన్నికల పోలింగ్‌కు మరో ఆరు రోజుల సమయం మాత్రమే మిగిలి ఉండడంతో.. అభ్యర్థులు సుడిగాలి పర్యటనలతో విస్తృతంగా ప్రచారాన్ని చేపడుతున్నారు. దాదాపుగా లోక్‌సభ పరిధిలోని అన్ని మండలాలను ప్రచారంతో చుట్టేస్తున్నారు. సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకునేందుకు బీజేపీ ప్రయత్నాలు చేస్తుండగా ఈసారి ఎలాగైనా గెలిచి తీరాలనే పట్టుతో కాంగ్రెస్ ఉంది. పార్టీ క్యాడర్‌నే బలంగా నమ్ముకుంటున్న బీఆర్‌ఎస్ త్రిముఖ పోటీలో విజయం ఖాయమన్న ధీమాతో కనిపిస్తుంది. ఇలా ప్రధాన పార్టీల అభ్యర్థులంతా గెలుపుపై ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్న చివరికి ఓటర్లు మాత్రం ఎవరికి మద్దతుగా నిలుస్తారో? అంతుచిక్కడం లేదు. ఈసారి లోక్‌సభ ఎన్నికల బరిలో మొత్తం 12 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఇందులో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు ఇద్దరు స్వతంత్ర అభ్యర్థులు ఉన్నారు. మిగితా ఏడుగురు అభ్యర్థులు గుర్తింపు పొందిన పార్టీల నుంచి పోటీ చేస్తున్నారు. ప్రధాన పార్టీల మధ్య గట్టిపోటీ కనిపిస్తున్న స్వతంత్ర, ఇతర పార్టీల అభ్యర్థులు ఏ మేరకు ప్రభావం చూపుతారన్నది చర్చనీయాంశంగా మారింది. ఏదైనా పరిస్థితి అటు ఇటు అయితే ఇక అంతే సంగతి అన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గత కొద్ది రోజులు గా లోక్‌సభ పరిధిలో రాజకీయ సమీకరణలు వేగంగా మారిపోవడం తో రాజకీయ పార్టీల అంచనాలు కూడా తారుమారవుతున్నాయి.

ఇతరులతో ఇబ్బందే..

లోక్‌సభ ఎన్నికల్లో ప్రస్తుతం పోటీ ఎవరి మధ్య అన్నదే ప్రధాన చర్చనీయాంశంగా మారింది. ఎవరు గెలిచిన స్వల్ప మెజార్టీతోనే గట్టెక్కె అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానంగా బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్యనే పోటీ ఉందన్న ప్రచారం జరుగుతుంది. కానీ బీఆర్‌ఎస్ పార్టీలో నేతలు లేక పోయిన క్యాడర్ కొంత బలంగానే కనిపిస్తుంది. లోక్‌సభ పరిధిలో బోథ్, ఆసిఫాబాద్ రెండు అసెంబ్లీ నియోజకవర్గాల్లో క్యాడర్ బీఆర్‌ఎస్ వెంటే ఉంది. అయితే ప్రధాన పార్టీల మధ్య నువ్వానేనా అన్నట్లుగా ఉన్న స్వతంత్ర అభ్యర్థులు, ఇతర పార్టీల



అభ్యర్థులతో కొంత ఇబ్బందికర పరిస్థితే కనిపిస్తుంది. ఎందుకంటే గత ఎన్నికల్లో చిన్న చితక పార్టీల అభ్యర్థులు సైతం ఐదు వేల నుంచి 10 వేల వరకు ఓట్లను దక్కించుకున్న దాఖలాలు ఉన్నాయి. ఇలా ప్రధాన పార్టీల అభ్యర్థుల గెలుపుకు గండికొట్టే అవకాశం లేకపోలేదంటున్నారు. రాజకీయాల్లో చిన్న పామునైనా పెద్ద కర్రతో కొట్టాలనే నానుడి ఉంది. ఈసారి నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసేంత వరకు ఒక్కరు మాత్రమే తన నామినేషన్‌ను విత్‌డ్రా చేసుకున్నారు. మిగితా వారంతా బరిలో నిలిచారు. తమకు మద్దతునివ్వాలని ప్రధాన పార్టీల అభ్యర్థులు స్వతంత్ర, ఇతర పార్టీల అభ్యర్థులతో సంప్రదింపులు జరుపుతున్నా.. వెనక్కి తగ్గినట్లు కనిపించడం లేదు.

నోటా వైపు మొగ్గు

ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు ఇతర పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు నచ్చక పోవడంతో ఓటర్లు నోటావైపు ఎక్కువగా మొగ్గుచూపుతున్నారు. 2019 ఎన్నికల్లో గెలుపొందిన బీజేపీ అభ్యర్థి సోయం బాపురావుకు 3 లక్షల 77వేల 374 ఓట్లు, రెండవ స్థానంలో నిలిచిన బీఆర్‌ఎస్ అభ్యర్థి గోడం నగేష్‌కు 3లక్షల 18వేల 814 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి రాథోడ్ రమేష్‌కు 3లక్షల 14వేల 238 ఓట్లు దక్కాయి. అభ్యర్థులు నచ్చని వారికి ఎన్నికల కమిషన్ నోటా అవకాశాన్ని కల్పించింది. దీంతో నోటాకు గత ఎన్నికల్లో భారీగా 13వేల 36 ఓట్లు రావడం చర్చనీయాంశంగా మారింది. ప్రధానంగా యువత చదువుకున్న వారే నోటావైపు ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తుంది. ఈసారి కూడా ఇదే పరిస్థితి కొనసాగితే ప్రధాన పార్టీల అభ్యర్థుల గెలుపోటములపై ప్రభావం చూపే అవకాశాలు లేక పోలేదంటున్నారు. దీంతో ప్రధాన పార్టీల అభ్యర్థులను ఇతర పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులతో పాటు నోటా టెన్షన్ కూడా వెంటాడుతుంది.

ఓట్ల చీలికపై ప్రధాన చర్చ

ఈసారి లోక్‌సభ ఎన్నికల్లో గుర్తింపు పొందిన పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు బరిలో ఉన్నారు. దీంతో వారి బలబలాలపై ప్రధాన పార్టీలు ఆరా తీస్తున్నాయి. అభ్యర్థుల బ్యాగ్రౌండ్, ఇతర పార్టీల ప్రభావం, వారు దక్కించుకునే ఓట్లు ఏ మేరకు ఉంటుందనే అంచనాలు వేసుకుంటున్నారు. ప్రధానంగా బీజేపీ, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల తర్వాత బీఎస్పీ పార్టీ కొంత ప్రభావాన్ని చూపే అవకాశం ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి. బీఎస్పీ సాంప్రదాయ ఓటు ఆ పార్టీ అభ్యర్థికే దక్కుతుందా లేదా ఇతర పార్టీల వైపు మొగ్గు చూపుతారా? అనేది చర్చనీయాంశంగా మారింది. ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ బీఎస్పీని వదిలి బీఆర్‌ఎస్‌లో చేరిపోవడంతో.. ఆ పార్టీ ఓటర్లు ఎవరికి మద్దతుగా నిలుస్తారో?నన్నది ఆసక్తిగా మారింది. అలాగే అలయన్స్ ఆఫ్ డెమెక్రటీ రిఫార్మ్ పార్టీ, ధర్మ సమాజ్ పార్టీ, ఇండియా ప్రజాబంధు పార్టీ, గోండ్వానా దండకారణ్య పార్టీ, విద్యార్థుల రాజకీయ పార్టీ, అన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలు పెద్దగా ప్రభావం చూపకపోయినా.. అభ్యర్థుల సొంత ఈమేజ్, పరిచయాలు, కులబలంతో ఓట్లను రాబట్టే ప్రయత్నం చేస్తున్నారు. ఈసారి ప్రధాన పార్టీల అభ్యర్థులంతా ఆదివాసీలే కావడంతో లంబాడా సామాజిక వర్గానికి చెందిన ఓటర్ల మద్దతు కూడా ఎటు వైపు? అన్నది ప్రధాన చర్చకు దారి తీస్తుంది. ఇలా ఓట్ల చీలికపై ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో ప్రధాన చర్చ కొనసాగుతోంది.





మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి కె.ప్రభాకర్ రావు

కేసులను సత్వరమే పరిష్కరించేందుకు లోక్ అదాలత్‌లు మంచి మార్గాలు

- జిల్లా న్యాయాధికారి కె.ప్రభాకర్‌రావు

ఆదిలాబాద్ అర్బన్, మే 7: బాధితులకు సత్వర న్యాయం అందించడానికి లోక్‌అదాలత్ మంచి మార్గమని జిల్లా న్యాయాధికారి కె.ప్రభాకర్‌రావు అన్నారు. జూన్ 8న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌పై న్యాయవాదులు, అధికారులతో సన్నాహాక సమావేశం నిర్వహించారు. జిల్లా కోర్టులో జరిగిన సమావేశంలో అధికారులు, ఆయా ఇన్సూరెన్స్ కంపెనీల ప్రతినిధులు, న్యాయవాదులు, పోలీసులు హాజరై పలు సూచనలు చేశారు. అత్యధిక కేసుల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయాధికారి కె.ప్రభాకర్‌రావు మాట్లాడుతూ కక్షిదారులు కోర్టుల చుట్టు తిరిగి సమయాన్ని వృథా చేసుకోకుండా కేసులను సత్వరంగా పరిష్కరించేందుకు లోక్ అదాలత్‌లు మంచి మార్గాలని తెలిపారు. దీనిపై కక్షిదారులకు తెలియజేస్తూ అత్యధికంగా కేసులను పరిష్కరించేలా ప్రతీఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. క్రిమినల్ కేసుల్లో కొంత సమస్యలు వస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. సమస్యలు రాకుండా చూస్తామన్నారు. జూన్ 8న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌పై ప్రతీఒక్కరికి తెలియజేస్తూ అధికసంఖ్యలో కక్షిదారులు హాజరయ్యేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు ప్రమీల జైన్, మంజుల సూర్యవార్, దుర్గారాణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్నాల నగేష్, తదితరులు పాల్గొన్నారు.



బుద్ధుడు, అంబేద్కర్ జయంతి పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే

అంబేద్కర్ బాటలో అందరూ నడవాలి

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్

ఉట్నూర్, మే 7: ఈనెల 14న ఉట్నూర్ మండలంలోని ఉమ్రి గ్రామంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే గౌతమబుద్ధుడు, అంబేద్కర్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బొజ్జుపటేల్ దళిత సంఘాల నాయకులతో కలిసి జయంతి ఉత్సవాల పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రపంచానికి శాంతి, అహింసాయుత మార్గాన్ని చూపిన బుద్ధుడు, అణగారిన తాడిత, పీడిత వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు డా.బాబాసాహెబ్ అంబేద్కర్ చూపిన బాటలో ప్రతిఒక్కరూ నడవాలన్నారు. ఈ జయంతి ఉత్సవాలకు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు, బహుజన సంఘాల నాయకులు, మేధావులు, విద్యార్థులు, కార్మికులు, కర్షకులు, పెద్దఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జయంతి ఉత్సవ కమిటీ సభ్యులు, దళిత సంఘాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు గైక్వాడ్ భారత్, జి.రోహిదాస్, నాందేవ్, కృష్ణ, సల్లీయా, జగదీష్, కరీం, రాజు, రమేష్, శ్యాంసుందర్, రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలి : స్వీప్ అధికారి

బోథ్, మే 7: ఓటు హక్కును ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా యువజన స్వీప్ అధికారి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకుని వారి వారికి నచ్చిన అభ్యర్థులకు ఓటు వేసుకునే అధికారం ఉందని ఆయన పేర్కొన్నారు. అనంతరం పట్టణంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొని ఓటు హక్కు గురించి వివరించారు. పట్టణంలోని పలు వ్యాపారులకు ఓటు హక్కు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుభాష్‌చంద్ర, సీఐ రమేష్, ఎస్ఐ రాము, ఎంపీడీవో రమేష్, ఎంపీఈవో మహేందర్ రెడ్డి, ఈవో అంజయ్య, ఏపీఎం మాధవ్, లక్ష్మీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు మాసం అనిల్, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఉట్నూర్ కోర్టుకు జడ్జిని నియమించాలి : బార్ అధ్యక్షుడు

ఉట్నూర్, మే 7: ఉట్నూర్ డివిజన్ కేంద్రంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు జూనియర్ సివిల్ జడ్జిని నియమించేలా చర్యలు తీసుకోవాలని ఉట్నూర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బాపురెడ్డి జిల్లా జడ్జి ప్రభాకర్‌రావును కోరినట్లు తెలిపారు. మంగళవారం జిల్లాకేంద్రంలో జిల్లా జడ్జిని కలిసి ఉట్నూర్‌లో జూనియర్ సివిల్‌జడ్జి లేక పోవడం వల్ల ఇబ్బందులు అవుతున్నాయని వివరించడంతో హైకోర్టుకు నివేదిక అందించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా జడ్జి తెలిపినట్లు బాపురెడ్డి వివరించారు. ఆయన వెంట జైవంతరావు ఉన్నారు.

ఉచిత శిక్షణలకు దరఖాస్తులు చేసుకోవాలి : డైరెక్టర్

ఉట్నూర్, మే 7: కొమురంభీం ప్రాంగణంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఉచిత స్వయం ఉపాధి శిక్షణల కోసం అర్హులైన యువతీ, యువకులు దరఖాస్తులు చేసుకోవాలని ఆర్‌సెట్ డైరెక్టర్ కుంరం లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. హౌజ్ వైరింగ్, సెల్‌ఫోన్ రిపేరింగ్, ఫోటోగ్రఫి వీడియోగ్రఫీలలో ఉచిత శిక్షణ ఇవ్వడం జరుగుతుందని ఆసక్తి ఉన్న వారు ఈనెల 24 వరకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం 27,29 తేదీలలో ప్రారంభమవుతుందన్నారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి భోజన సౌకర్యం కల్పిస్తామని, శిక్షణ అనంతరం టూల్స్ కిట్స్ ఇవ్వడం జరుగుతుందన్నారు. పదో తరగతి వరకు చదువుకున్న వారు పాస్, ఫెయిల్ అయినవారు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఆధార్‌కార్డు, తెల్లరేషన్‌కార్డు, పాన్‌కార్డు, బ్యాంకు ఖాతా పాస్‌పుస్తకం జిరాక్స్‌లతో పాటు నాలుగు పాస్‌పోర్టు సైజు ఫొటోలు పెట్టి దరఖాస్తులు ఇవ్వాలన్నారు. ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు మాత్రమే దరఖాస్తులు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఇంకా ఏమైనా వివరాలు కావాలనుకునే వారు మొబైల్ నెం. 9949412159, 8985633226 ద్వారా సంప్రదించాలని పేర్కొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

జైనథ్, మే 7: మండలంలోని కేదార్‌పూర్ గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకులు గోవింద్‌రావ్ ఇటీవల గుండెపోటుతో ఇటీవల మరణించారు. విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ మంగళవారం కేదార్‌పూర్ గ్రామానికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. గోవింద్‌రావ్ కుటుంబానికి ఎళ్లవేళలా ఆదుకుంటామని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే వెంట బీజేపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆస్తక్‌సుభాస్, జిల్లా నాయకులు ముకుందరావ్, బిబేకర్‌లతో పాటు కేదార్‌పూర్ గ్రామ ప్రజలున్నారు.



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

సమాజంలో పెరుగుతున్న మూఢ నమ్మకాల పట్ల..

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ రాజార్షిషా
- జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో డైట్ కళాశాలలో సైన్స్ సమ్మర్ క్యాంప్
- పాల్గొన్న విద్యార్థులు, తల్లిదండ్రులు



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజార్షిషా



ఆయా పాఠశాలల విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేస్తూ..

ఆదిలాబాద్ అర్బన్, మే 7: సమాజంలో పెరుగుతున్న మూఢ నమ్మకాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాజార్షిషా అన్నారు. సోమవారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో స్థానిక డైట్ కళాశాలలో నిర్వహించిన సైన్స్ సమ్మర్ క్యాంప్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజార్షిషా మాట్లాడుతూ మూఢనమ్మకాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, శాస్త్రీయ వైఖరీ ద్వారానే మూఢ నమ్మకాల నుంచి బయటపడవచ్చని తెలిపారు. ప్రతి అంశాన్ని ప్రశ్నించి స్వీకరించాలని సూచించారు. అనంతరం సైన్స్ సమ్మర్ క్యాంప్‌లో విద్యార్థుల ప్రదర్శనను తిలకించారు. సమాజంలో మూఢనమ్మకాలను నిరోధించడంలో శాస్త్రీయ వైఖరిని పెంపొందించడంలో జనవిజ్ఞాన వేదిక చేస్తున్న కృషిని అభినందించారు. ఇందులో జిల్లా విద్యాశాఖాధికారి ప్రణీత, జిల్లా సైన్స్ అధికారి రఘురమణ,జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సంతోష్‌కుమార్ బెదోడ్కర్, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

సెకండ్ ర్యాండమైజేషన్‌ను పరిశీలన

ఆదిలాబాద్ అర్బన్: ఆదిలాబాద్ పార్లమెంటరీ నియోజక వర్గ మూడు సెగ్మెంట్స్ నిర్మల్, ముథోల్, ఖానాపూర్‌లకు సంబంధించిన కంట్రోల్ యూనిట్స్ సప్లమెంటరీ సెకండ్ ర్యాండమైజేషన్‌ను కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సెకండ్ ర్యాండమైజేషన్‌ను ఎన్నికల సాధారణ పరిశీలకులు రాజేంద్ర విజయ్, రిటర్నింగ్ అధికారి రాజార్షిషా, రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పూర్తి చేశారు. అసెగ్మెంట్ల పరిధిలో కమిషనింగ్ సందర్భంగా సాంకేతిక సమస్యలు తలెత్తిన ఈవీఎంల స్థానంలో అదనంగా కేటాయించబడిన ఎలక్ట్రానిక్‌ఓటింగ్ యంత్రాలకు మంగళవారం రెండవ విడత సప్లమెంటరీ ర్యాండమైజేషన్‌ను మూడు సెగ్మెంట్స్‌కు సంబంధించిన సీయూలు నిర్మల్ 50, ముథోల్ 50, ఖానాపూర్ 50 అదనంగా కేటాయించగా ఈ అదనపు సీయూలుసెక్టోరల్ అధికారుల వద్ద రిజర్వ్‌లో పోలింగ్ సమయంలో ఎక్కడైనా ఈవీఎంలలో సాంకేతిక సమస్య తలెత్తితే, నిమిషాల వ్యవధిలోనే సెక్టోరల్ అధికారులు సంబంధిత పోలింగ్ స్టేషన్‌కు చేరుకుని తమవద్ద రిజర్వ్‌లో ఉండే సీయూలను సమకూరుస్తారని తెలిపారు. పోలింగ్ జరిగే మే 13న పోలింగ్ కేంద్రాలకు వచ్చే ప్రజలు ఓటర్ స్లిప్పుతో పాటు 12 రకాల కార్డులలో ఏదైనా ఒకటి తమ వెంట తప్పని సరిగా తీసుకెళ్లాలని సాధారణ పరిశీలకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ అదనపు కలెక్టర్ శ్యామలదేవి, నిర్మల్ అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు, ఈడీఎం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాధారణ పరిశీలకుడు రాజేంద్ర విజయ్

కార్మికుల త్యాగాల వల్లే 8గంటల పని దినం

- సీఐటీయూ అఖిల భారత కోశాధికారి సాయిబాబు

ఆదిలాబాద్ అర్బన్, మే 7: కార్మికుల హక్కులు, ఎనిమిది గంటల పని దినం కోసం ప్రాణాలర్పించి చట్టాలు సాధించుకున్నారని సీఐటీయూ అఖిల భారత కోశాధికారి సాయిబాబు తెలిపారు. మేడే వారోత్సవాల ముగింపులో భాగంగా మంగళవారం టీఎన్జీవోస్ భవనంలో సభను నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మేడే, సీఐటీయూ చేసిన ఉద్యమాలను తెలియజేశారు. అంతకు ముందు సీఐటీయూ కార్యాలయం నుంచి సభస్థలి వరకు పెద్ద ఎత్తున సీఐటీయూ అనుబంధ సంఘాల నాయకులు ర్యాలీగా వచ్చారు. ఈ సందర్భంగా సీఐటీయూ అఖిల భారత కోశాధికారి సాఇయబాబు మాట్లాడుతూ 1886 మే 1న అమెరికాలోని చికాగోలో పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా కార్మిక వర్గం ఎనిమిది గంటల పనిదినం కోసం ఉద్యమించిందన్నారు. ఆ క్రమంలో అక్కడి ప్రభుత్వం వారి పై పోలీసులతో కాల్పులు జరిపించడంతో అనేక మంది కార్మికులు అమరులయ్యారన్నారు. వారి త్యాగాల కారణంగా నేడు ప్రపంచ వ్యాప్తంగా ఎనిమిది గంటల పని దినాలు అమలవుతున్నాయన్నారు. కార్మికుల హక్కుల కోసం సీఐటీయూ అనేక ఉద్యమాలు చేసి సాధించిదని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆశన్న, అన్నమొల్ల కిరణ్, సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, లంకరాఘవులు,బండిదత్తాత్రి, మమత, చిన్నన్న, అగ్గిమల్లస్వామి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాయిబాబు